
# మోదుగుపూలు

అరవింద

మా ఇల్లు ఉషావాళ్ళింటికీ, శేఖర్ వాళ్ళింటికీ మధ్యన వుంది. ఒకప్పుడు వరసగా వున్న ఆ మూడిళ్ళూ శేఖర్ తాతగారి వేనుట. ఒక ఇంటిని ఆయన కూతురి పేర అంటే ఉష తల్లి పేర రాశారు. ఆయన పోయాక ఇంకొక ఇంటిని కొడుకు అమ్మేశాడు. మా తాతగారు కొన్నారుట. ఇప్పుడు మేం వుంటున్నాం. మాది, ఉషా వాళ్ళది మామూలు డాబా ఇళ్ళు. శేఖర్ వాళ్ళది పెద్ద మేడ.

శేఖరూ నేనూ ఒకే స్కూల్లో చదివే వాళ్ళం. అతడు నాకంటే పెద్దవాడు. ఐనా ఫెయిలవుతుండటం వలన అతడూ నేనూ ఒక



క్లాసు అయ్యాం. శేఖర్ వాళ్ళ బంధువులైనా ఉష మా ఇంటికే ఎక్కువ వచ్చేది. నాతోనూ అక్కయ్యలతో కూడా స్నేహంగా వుండేది. ఉష బాగుంటుందని అందరూ అనేవారు. ఉష చాలామంది ఆడపిల్లలకంటె చక్కనిదని. మెడిసిన్ చదవటానికి వాల్తేరు వెళ్ళి సెలవలకి యింటికి వచ్చినప్పుడు తెలిసింది నాకు.

శేఖర్ కూడా డొనేషన్ కట్టి కాకినాడ మెడికల్ కాలేజీలో చేరాడు.

"ఎట్లాగో డాక్టర్ అనిపించుకుంటే...." అన్నాడు వాళ్ళ నాన్న.

సాయంత్రం అక్కయ్య, ఉష జాజి పందిరి దగ్గర పూలు కోసుకుంటున్నారు.

ఆరునెలల తరవాత ఉషని చూస్తుంటే "ఎవ్వరీ సుందరాంగి! ఎక్కడదీ మెరుపుతీగ!" అనిపించింది.

తనని చూస్తుంటే చాలు అనిపించింది. ఏదో సంతోషం. పరవశత్వం. పలకరించాను. ఉష కళ్ళు తిప్పుతూ మాట్లాడుతుంటే పిచ్చివాడిలాగ చూస్తూ వుండిపోయాను. ఉష కూడా నన్ను పరిశీలించి చూపి

"పొడుగయ్యావు" అంది.

"అంతేనా!" అన్నాను.

"మరి!" అంది.

నేనూ ఉషా పూలు కోస్తున్నాము. అక్కయ్య వరండాలో కూచుని మాల కడుతోంది.

"నువ్వు చాలా మారిపోయావు. తెరి హుస్న్‌కి క్యాతారీఫ్ కరూ . అని పాడాలనిపిస్తోంది" అన్నాను.

"ఐతే పాడు" అంది.

"తెరిహుస్న్‌కి క్యాతారీఫ్‌కరూ...కుఛ్ కహెతె హువే డర్ లగ్‌తా హై కహీం భూల్ సె ఏన సమజ్ లేనా కెమైంతుమ్‌సె మొహబ్బత్ కర్‌తాహూ" పాడాను.

ఉష కిలకిలా నవ్వింది. ఆ మాత్రం హిందీ ఉషకి అర్థమవుతుంది. స్కూల్లో కొంచెం చదివింది. హిందీ సినిమాలు చూస్తుంటుంది.

అనుకోకుండా నా మనసులో మాటకి ఆ పాట అర్థం సరిపోయింది.

నీ అందాన్ని ఏమని వర్ణించనూ!

ఏమనటానికీ భయం వేస్తోంది.

నేను నిన్ను ప్రేమిస్తున్నాననుకుని పొరపడకు!

ఉష అంటే నాకిష్టంవుంది. ఆకర్షణ వుంది. ఉష నాలో ఎన్నో ఆశలు రేపుతోంది. కానీ ఇప్పటినుంచే పెళ్ళిగురించి ఆలోచించి బాధపడదలుచుకోలేదు. ఏ వయసులో చెయ్యాల్సిన విధులు ఆ వయసులో పాటించాలి. ఇది బాగా చదువుకుని వృద్ధిలోకి రావలసిన సమయం. బాగా చదువుకుని మంచి డాక్టర్నైతే అనుభవించే కాలమంతా ముందువుంది. అప్పుడు పెళ్ళి. అప్పటిదాకా ఉష ఆగుతుందా నాకోసం? ఆగితే అంతకంటె ఆనందం వుండదు. అప్పుడు పరిస్థితులెట్లా ఉంటాయో!

మర్నాడు మధ్యాహ్నం ఉషా వాళ్ళింటికి వెళ్ళాను. అట్లాగ వెళ్ళటం నా కలవాటే. వాళ్ళ హాలులో ఉయ్యాల వుంటుంది. ఆ బల్లమీద కూచోటం నాకు అలవాటు. వెళ్ళి అక్కడ కూచున్నాను. ఉష కనిపించలేదు. ఉషా వాళ్ళమ్మా, ఇంకొక పెద్దావిడా అక్కడ కూచుని కబుర్లాడుకుంటున్నారు. వాళ్ళమ్మ పిలిస్తే చేతిలో తను చదువుతున్న నవల పట్టుకుని వచ్చింది ఉష.

వంటింట్లో వాళ్ళ వదిన బజ్జీలు చేస్తోంది. పళ్ళాలలో అందరికీ యిచ్చి వెళ్ళింది.

"స్కూలెప్పుడూ" అన్నాను బజ్జీలు తింటూ.

"పరీక్ష మళ్ళీ తప్పేసింది. స్కూలికి బైబై చెప్పేశాను. మెట్రిక్‌కి కట్టమన్నారు నాన్న" అంది.

"ట్యూషన్ ఉందా? శ్రద్ధగా చదువుతున్నావా మరి?" అనడిగాను.

"ఆ. చాలా శ్రద్ధగా ఇవి . చదువుతున్నా" అంటూ నవల చూపించింది.

నా కెందుకో చివుక్కుమనిపించింది... చదువును నిర్లక్ష్యం చెయ్యటం.

"బజ్జీలు బాగున్నాయి" అన్నాను.

ఇంకా తెస్తానని ఉష లోపలికి వెళ్ళింది. నా ధ్యాస పెద్దవాళ్ళ సంభాషణ వేపు మళ్ళింది.

"మా నాన్న నాకు ఇల్లు ఇచ్చాడని మహా అసూయ వాళ్ళకి. మా వదినకి అప్పటినుంచీ నా మీద కోపమే. అట్లాగని మా నాన్న వాళ్ళకేం తక్కువ చెయ్యలేదు. బోలెడంత ఆస్థి .. పొలాలన్నీ వాళ్ళవే." అంది అత్తయ్య.

ఉషా వాళ్ళమ్మని అత్తయ్య అనటం శేఖర్‌తోబాటు నాకూ అలవాటయింది.

"ఎంత ఆస్థి ఇచ్చినా ఏం లాభం! నిలబెట్టుకోవటం చేతకావాలి. కూచుని తింటుంటే గుళ్ళూ గోపురాలూకూడా కరిగిపోతాయి" అంది రెండో ఆవిడ.

ఉష బజ్జీలు తెచ్చింది. తింటూ ఇద్దరం ఆ సంభాషణ వింటున్నాం.

"రెండేళ్ళ క్రిందట ఒకసారి పేరంటంలో కలుసుకున్నాం రుక్మిణీ నేనూ.

మా ఉషని మీ శేఖర్‌కి చేసుకోండి వదినా అన్నాను సరదాకి. ఆవిడ సరదాకైనా అట్లాగే అనలేదు. వాడికి ఇప్పుడే పదివేలు ఇస్తామంటూ సంబంధాలొస్తున్నాయి. మెడిసిన్ పూర్తయితేగానీ చెయ్యం. పాతికవేలు తెచ్చిన పిల్లే మా కోడలు అవుతుంది ... అంది." ఉషా వాళ్ళమ్మ అంది.

ఉష మెల్లిగా నా చెయ్యి గిల్లి

"నువ్వూ అంతేనా డాక్టరూ!" అంది.

"ఇప్పుడు నేనా విషయం ఆలోచించటం లేదు. ఇంకా చిన్నవాళ్ళమేకదూ" అన్నాను.

* * *

ఇంకొక ఏడాది అట్లాగే మార్పు లేకుండా గడిచిపోయింది.

మెడిసిన్ మూడవ సంవత్సరంలో ఉండగా అతడి ప్రవర్తన బాగుండలేదని శేఖరాన్ని కాలేజీలోంచి తీసేశారు. హాస్పిటల్ నర్సులతో స్నేహాలున్నాయిట. తాగటం అలవాటైందిట. అతడి అసభ్య ప్రవర్తన గురించి కాలేజీకి కంప్లెయింట్స్ వెళ్ళాయి. వార్నింగులిచ్చినా లక్ష్యపెట్టలేదు శేఖర్. మధ్యలోనే చదువు ఆపేసి ఇంటికి వచ్చేశాడుట.

ఆ ఏడాది గడిచాక నేను వెళ్ళాను. అప్పుడు తెలిశాయి జరిగిన సంగతులన్నీ.

సాయంత్రం జాజిపూలు కోసుకోటానికి ఉష వస్తుందేమో ననుకున్నాను.

రాలేదు. చూసి చూసి నేనే వాళ్ళింటికి వెళ్ళాను.

మామూలుగా ఉయ్యాల బల్లమీద కూచున్నాను.

ఉష పక్కగదిలోంచి వచ్చింది. పడుకుని లేచినట్లుంది.

"సాయంత్రం వేళ కూడా ఏమిటే ఆ పడక! లక్షణంగా తల దువ్వుకోక!" అంటూ కోప్పడింది అత్తయ్య.

ఉష నవ్వేసి తనూ కూర్చుంది ఉయ్యాల బల్లమీద.

క్రిందటిసారి చూసినప్పటికంటె కూడా బాగుంది ఉష అనుకున్నాను.

ఎవరో పనికుర్రాడు పొట్లంతో పూలు తెచ్చి ఇచ్చాడు ఉషకి. పొట్లం విప్పి వాసన చూస్తోంది ఉష. పూలు అప్పుడే విచ్చుకుంటున్నాయి. ఒక్కసారిగా మత్తు కలిగేలా పరిమళం వీచింది.

"ఇప్పుడు రుక్మిణమ్మొదినకి మామీద ప్రేమ పొంగి పోతోందిలే. మా శేఖర్‌కి మీ ఉషని ఇవ్వండి అంటూ కబురుచేసింది. కట్నం అవసరం లేదుట.

చదువు మానేసి వొచ్చాడుకదూ. ఇంక కట్నం ఎవరిస్తారు?పిల్ల బంగారుబొమ్మలా కనిపిస్తుంటే ఆశపడుతున్నారు కానీ ఇక్కడ ఇవ్వటానికి ఎవరూ సిద్ధంగా లేరు. కట్నం ఇచ్చి ఉద్యోగస్థుడికే ఇస్తాం" అంది అత్తయ్య.

"చాల్లే అమ్మా" అంది ఉష.

"బానే. నువ్వూరుకో. ఎప్పుడూ మా ఇంటికి వచ్చేది కాదు. వీధిలో ఎదురైతే పలకరించేదికాదు. ఇప్పుడు కొడుకుని పంపిస్తోంది మా ఇంటికి. కోడలికి అంటూ రోజూ పూలు పంపిస్తోంది"అంది.

ఉష మెల్లగా నాకు వినిపించేలాగ అంది

"పూలు అత్తయ్య పంపటం లేదు. శేఖరే పంపిస్తున్నాడు."

అత్తయ్య లోపలికి వెళ్ళింది పనులు చూసుకోటానికి. ఉష దారం తెచ్చుకుని పూలు మాల కడుతోంది. ఆ వికసిత వదనాన్ని చూస్తున్నాను. చటుక్కున గుర్తొచ్చింది.

"మెట్రిక్ అయిందా?" అనడిగాను.

"ఇంకేం చదువులే!" అంటూ తమాషాగా నవ్వింది.

"చదువుకునే వయసులో చదువుకోవాలి."

"ఆఁ ప్రేమలేఖలు చదువుకునే వయసు" అంది.

నాకు కొంచెం సిగ్గు వేసింది.

"అమ్మకి నాన్నకి ఇష్టంలేదు కానీ శేఖర్ నన్నే చేసుకుంటానంటున్నాడు."

"నీ కిష్టమేనా?" ఆత్రంగా అడిగాను.

"నన్ను అట్లాగడగడానికి నీకు సిగ్గెయ్యటం లేదూ" అంది నా కళ్ళలోకి చూస్తూ.

"నువ్వే చెప్తున్నావు" అన్నాను.

"ఇష్టమో అయిష్టమో నాకు తెలీదు. అతడు నాకు కావాలి." అంది ఎటో చూస్తూ.

అత్తయ్య నాకు కాఫీ ఇచ్చి వెళ్ళింది. తాగుతున్నాను. ఉష లోపలికి వెళ్ళి మొహం కడుక్కుని జడ అల్లుకుని పూలు పెట్టుకుని వచ్చింది.

ఉయ్యాలగొలుసు పట్టుకుని నుంచుంది.

"ఎందుకట్లాగ చూస్తున్నావ్. నాకు దిష్టి తగులుతుంది" అంది నవ్వుతూ.

"శేఖరాన్ని ప్రేమిస్తున్నావా?" అనడిగాను బాధ నణుచుకుంటూ.

"ఇటురా." అంది గదిలోకి నడుస్తూ.

కప్పుపెట్టి ఉష వెనకాలే వెళ్ళాను. అల్మైరా తెరిచి చీర మడతల్లోంచి కవర్లు తీసింది.

"చూడు ఇవన్నీ. శేఖర్ రాసిన ప్రేమ లేఖలు" అంది.

ఊళ్ళోనే ఉండి ఇవన్నీ రాస్తున్నాడు. ముళ్ళకంపలా అనిపించి ముట్టుకోలేక పోయాను.ఏమి రాశాడో అనే కుతూహలం కంటె ఏం రాస్తాడులే అనే జుగుప్స ఎక్కువగా ఉంది. అక్కడ భాగవతం

అయింది. ఇక్కడ భారతం మొదలు పెట్టాడు కాబోలు. వొళ్ళు మండిపోతోంది.

"ఒకరోజు తనే ముందర మా ఇంటికి వచ్చాడు. పెద్దవాళ్ళ పంతాలూ పట్టింపులూ తనకి లేవన్నాడు. నవలలు చదువుతావా నా దగ్గర చాలా ఉన్నాయి పంపుతానన్నాడు. ఉత్తరాలు రాసి గోపిచేత పంపిస్తాడు. నన్ను పెళ్ళి చేసుకుంటాడుట. నేను లేకపోతే బతకలేడుట. కట్నం వద్దుట. నేనే పది లక్షలు చేస్తానుట."

వాడికి ఆడపిల్లల్ని వలలో వెయ్యటం బాగా తెలుసు.

"ఐతే నీకూ ఇష్టమే."

"అమ్మా వాళ్ళకి ఇష్టం లేదు. అందుకని నేనేమీ అనుకోలేదు. ఇష్టమూ లేదు అయిష్టమూ లేదు. కానీ ఆరోజు పేరంటానికి వెళ్ళి వస్తుంటే శేఖర్ పిలిచాడు. వెళ్ళాను." అని ఆగింది. తరవాత ఏమయిందీ ఎట్లా చెప్పాలో ఆలోచిస్తున్నట్లుంది.

"అత్తయ్య గుడికి వెళ్ళిందిట. ఏవో పూజలు చేయిస్తోందిట. కూచోమని రికార్డులు పెట్టాడు. కాఫీ చేయించి తెచ్చాడు. తాగాక వెడతానన్నాను. వెళ్ళనివ్వలేదు. గుమ్మానికి అడ్డునుంచున్నాడు. కౌగిలించుకున్నాడు. ముద్దుపెట్టుకున్నాడు. అప్పుడు చుట్టూచూశాను. దగ్గర్లో ఎవరూ లేరు. తలుపులు వేసి ఉన్నాయ్. అతణ్ని తోసేశాను. రక్కాను. కానీ శేఖర్ విడిచిపెట్టలేదు. నవ్వేశాడు. తరవాత .... నాకేమయిందో తెలీదు. నీకూ తెలుసు శేఖర్ బాగుంటాడు. చక్కగా నవ్వుతాడు.


క్రొత్తది!

అమృతాంజన్ లిమిటెడ్‌వారి విశిష్టమైన

ఆముదము

శుద్ధిచేసినది.
వాసనలేనిది.

అమృతాంజన్ ఆముదము




మూడు సైజులలో
50 మిలి
100 మిలి
200 మిలి

OBM 3270A/3RTG

అట్లాగే మాట్లాడతాడు. అతడినేమీ అనలేకపోయాను. ఇప్పుడు చెప్పు. నేను శేఖర్ని పెళ్ళిచేసుకోవాలా వద్దా? ఉత్తరాలు రాస్తున్నాడు. మా ఇంటికి వస్తున్నాడు. పెళ్ళి చేసుకుంటా నంటున్నాడు....

పుస్తకాల భాషలో నేను పవిత్రురాల్ని కాదు."

నాకంత కోపం వస్తోంది. ఉష అంత చల్లగా ఎట్లా చెప్పగలుగుతోంది!

పుస్తకాల భాష వేరూ, జీవితం వేరూనా?

"నాకు స్నేహితులెవరూ లేరు. నాకేం తెలియటం లేదు. పాపం శేఖర్... మంచి వాడు. నేనంటే ప్రాణం.... ప్రేమ."

ప్రాణం! ప్రేమ! కళ్ళకి పొరలు గమ్మితే కోతికూడా రంభలాగే ఉంటుంది.

చాలా అందగాడు, చాలా మంచివాడు దొరికాడు.

"ఐతే ఇంకేం చేసుకో" అన్నాను కసిగా.

* * *

అప్పుడప్పుడు కాదు, ఉష తరచూ గుర్తువచ్చేది.

శేఖర్ ఉషని నిజంగానే ప్రేమించాడేమో! పెళ్ళి చేసుకుంటే ఇద్దరూ సుఖంగా ఉంటారేమో అనుకునేవాడిని.

శేఖర్ పెళ్ళయ్యాక కుదురుగా ఉంటాడా! పరాయి ఆడవాళ్ళ వెంట తిరుగుతూ ఉషని ఏడిపిస్తాడా అనుకునేవాడిని. బాధపడేవాడిని.

శుభలేఖ వచ్చింది. ఉషకి శేఖర్‌తో పెళ్ళి. చివరికి తల్లిదండ్రుల్ని ఒప్పించి ఉంటుంది. లేకపోతే నెల తప్పటంలాంటి దేమైనా జరిగిందా? పెళ్ళికి వెళ్ళాలనిపించలేదు. పరీక్షలు దగ్గిరికివస్తున్నాయి. తీరికా లేదు. గ్రీటింగ్సు పంపాను.

శేఖర్ సంసారంచేస్తున్నాడు హాయిగా ఉషతో.

నేనింకా ఇట్లాగే ఉన్నాను. పరీక్షలనీ చదువనీ బ్రహ్మచర్యం పాటిస్తున్నాను.

నాకూ శేఖర్‌లాగ ఆస్థి మేడలూ ఉంటే....

ఆస్థి ఉంటే కష్టపడి చదవ నవసరం లేదు. ఉద్యోగమూ అక్కర్లేదు. పెళ్ళి చేసుకుని హాయిగా నిశ్చింతగా బతికెయ్యొచ్చు.

మాకు అంత ఆస్థి లేదు. చదవక తప్పదు. ఉద్యోగమూ తప్పదు. తరవాతే పెళ్ళి ఆలోచన అని సరిపెట్టుకున్నాను. అప్పటిదాకా శేఖర్ అదృష్టం నన్నెప్పుడూ బాధించలేదు.

సెలవలకి ఇంటికి వెళ్ళాను. ఉష వాళ్ళింట్లో లేదు. శేఖర్ ఇంట్లో వుంది. వాళ్ళింటికి వెళ్ళాను. ఉషని చూడటానికి శేఖర్ ఇంటికి వెళ్ళటం కొత్తగా వుంది.

ఉష ఇంకా అందంగా ఉంది. ఆశ్చర్యం వేసింది. నేను చిన్నప్పటినుంచీ చూస్తున్న ఉషే. ఎక్కడనుంచీ వచ్చిందీ అందం! లోపలినుంచా పైనుంచా?

పెళ్ళి. ప్రేమా కొత్త అందాల్ని సమకూరుస్తాయి కాబోలు. ఇంట్లోకూడా జార్జెట్ చీర కట్టుకుంది. హిందీ సినిమా స్టార్‌లాగుంది. రుక్మిణి పిన్నికూడా బాగా గారాబం చేస్తోంది.

పెళ్ళిలో తీసిన ఫోటోలు చూపించారు. ఇద్దరూ ఆనందంగా.

"మేడ్ ఫర్ ఈచ్ అదర్" అన్నట్లుగా ఉన్నారు ఆ పోజులూ, నవ్వులూ.

నా గుండెలో అసూయ మొదటిసారి కలిగింది

నేనూ ఉద్యోగం రాగానే ఉషలాంటి అందగత్తెని చేసుకోవాలి

అందం అనుభవించని జన్మ వృథా అనుకున్నాను

ఫలహారం కాఫీ అయ్యాయి.

"ఇవాళ ఎక్కడికి వెడదాం?" అంది ఉష.

"ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తా. నువ్వు ఎక్కడ వుంటే అక్కడ స్వర్గం. నీవెంటే వుంటుంది ఆనందం. ఇంట్లోనే వుంటే ఇంకా వైభోగం" అన్నాడు.

"రవి వింటున్నాడు. ఏమిటా మాటలూ" అంది ఉష విరగబడి నవ్వుతూనే.

"ఏం! వాడికేం తెలీదా? పోనీ తెలుసుకుంటాడు తెలుసుకోపోతే వాడికే నష్టం. వాడేం కోల్పోతున్నాడో వాడికే తెలీదు"


వీడు తాగలేదుకదా అనుకున్నాను వాడి మీద కోపమూ వచ్చింది

నామీద నాకు జాలికూడా వేసింది. అక్కడ వుండాలనిపించలేదు.

"ఎక్కడికి వెడతారో వెళ్ళండి" అని వచ్చేశాను.

మర్నాడు మళ్ళీ వెళ్ళాను. అయిష్టంతో బాటదొక ఆకర్షణ.

సాయంత్రమయింది. ఇంకా గది తలుపులు వేసి వున్నాయ్.



"ఇంకా లేవలేదు" అంది పిన్ని నవ్వుతూ.

"వాడికేం చదువా ఉద్యోగమా? పనా పాటా? తెలిసిన కాలక్షేపం అదొకటే!" అనుకున్నాను. నిరసనలో అసూయకూడా వుంది. తరవాత పదిరోజులున్నా వాళ్ళింటికి వెళ్ళలేదు.

* * *

మెడిసిన్ పూర్తయింది. ఏడాది తర్వాత వెడుతున్నాను.

నాన్నగారు ఉత్తరాలలో క్షేమం తప్ప సంగతులు రాయరు.

ఉష ఎట్లాగుంది? ఈ పాటికి ఒక కూతురో కొడుకో పుట్టి వుంటారు.

తల్లి ఐన ఉష ఎట్లా వుందో! ఇంకా కొత్త అందాలు వస్తాయా? మాతృత్వం స్త్రీకి నిండుతనం ఇస్తుంది అంటారు. కొత్త కుతూహలం ఉషంటే.

"పిన్నిగారింట్లో అంతా కులాసా!" అనడిగాను అమ్మని భోజనం చేస్తున్నప్పుడు.

"ఆ, అంతా బాగానే వున్నారు. పాపం ఉషకే వరసగా రెండుసార్లు ఎబార్షనయింది. రుక్మణమ్మ మనవడో అని కలవరించి నిరాశపడిపోతోంది" అంది అమ్మ.

ఉషని చూడటానికి వెళ్ళాలనిపించటం లేదు. మళ్ళీ వెళ్ళాలనీ ఉంది. అట్లాగ ఆలోచిస్తుంటే దీపాలవేళయింది. అప్పుడు వెళ్ళాను.

పిన్ని గుడికి బయలుదేరుతోంది. హరి కథ వుందిట.

"శేఖర్ అట్లాగ సెంటర్‌కి వెళ్ళాడు! ఉష వుంది. వెళ్ళు" అని రిక్షా ఎక్కి వెళ్ళింది పిన్ని.

ఉష కింద కనిపించలేదు. పైన వాళ్ళ గదిలో వుంటుందని మెట్లు ఎక్కుతుంటే గుండె వేగంగా కొట్టుకుంది. అమ్మ చెప్పిన మాటల్ని బట్టి .. ఉష ఎట్లా వుందో అనుకున్నాను. ఓదార్చాలా? ఆరోగ్యం ఎట్లాగుందో? డాక్టరుగా ఏమైనా సలహా ఇవ్వగలనా అని ఆలోచిస్తూ గదిలో అడుగు పెట్టాను.

"రా, రవీ" అంది ఉష సంతోషంగా.

అక్కడ ఉన్న సోఫాలో కూర్చున్నాను. ఉష మంచంమీద కూచునివుంది.

"శేఖర్ ఏడీ?" అనడిగాను ఉషని చూస్తూ.

అందమైన వాలుజడలో మల్లెలమాల. కళ్ళనిండా కాటుక, తెల్లని ఇస్త్రీ చీర.

"ఆయనా! ఎక్కడికి వెడతారు? ఇక్కడికే వస్తారు." అంది.

ఏమంటోందో నాకు సమంగా అర్థం కాలేదు. కళ్ళలోకి చూశాను.

కాటుక నన్ను వెక్కిరించింది. కళ్ళలో ఏముందో కనబడకుండా పూసిన మసి.

"అంతా కులాసా . నువ్వు ...." అంటున్నాను.

"నేనూ... చాలా కులాసాగా వున్నాను. హుహుహూహూ" ఉష నవ్వుతోంది.

ఆ నవ్వు అసహజంగా వుందనిపించింది. అటే చూస్తున్నాను.

"నీ చదువైంది. ఇంక పెళ్ళి చేసుకుంటావేమో! హి ..హిహి" మళ్ళీ నవ్వు.

"చదువైంది. ఉద్యోగం రావాలి" అన్నాను .

" నీకేమిటి, డాక్టర్‌వి. డాక్టర్‌కి అన్ని

జబ్బులూ తెలుస్తాయా?"

"తెలుస్తాయి. ఎట్లాంటి జబ్బా " అంటున్నాను.

"ఇంత సంతోషంగావున్నామా .నా కెందుకో అస్తమానం ఏడుపు వస్తుంది "

"ఏమిటి ఉషా! ఏమైంది!" భుజం పట్టుకుని కుదిపాను. తలెత్తింది.

"నాకా! ఏమీ కాలేదు. తమాషాగా లేదూ హి హి . హి ..." నవ్వుతోంది మళ్ళీ.

"ఉషా!" గద్దించాను.

వెంటనే విరుచుకుపడినట్లు పక్కమీద పడింది ఉష. ఫిట్ అని తెలుస్తోంది.

అక్కడే కూజాలోవున్న నీళ్ళు చల్లాను. రెండు నిముషాలకి తేరుకుంది.

మెట్లుదిగి వెళ్ళి వంటావిడని పిలిచి చెప్పాను.

"ఈ మధ్య అంతే నాయనా. అన్నీ వున్నా అనుభవించే అదృష్టం లేదు" అంటూ హార్లిక్సు కలిపియిచ్చింది. ఉషకి తాగించాను. తాగాక స్వస్థకుని పడుకుంది. నీరసంగా పడుకున్న ఉషని పరికించి చూశాను ఉష దగ్గరగా ఏడాదినుంచి అనారోగ్యంగా వుంది ఐనా ఆ అందం కొంచెం కూడా తగ్గలేదు ఇదేం జబ్బు!

"నాకేమన్నా మందిస్తావా?" అంది ఉష కొంచెం సేపటికి కళ్ళు తెరిచి చూస్తూ. అదొక కొంటె నవ్వు. ఛాలెంజ్ చేస్తున్నట్లుంది.

"ఇస్తాను. సరిగ్గా చెప్పు."

"నువ్వేం చెప్తావ్. నేను చెప్తాను విను" అంది.

"నిన్ను కొడతారా రేఖస్" అడిగాను

"కొట్టడమంటే చేత్తో, లాఠీతో కొట్టడమా! ఉహూ. నువ్వంటే ప్రేమ. నా ప్రాణం నువ్వు అంటాడు. నేను యింక అతడేం చెప్తే అదిచేస్తాను. ఇంకాకొట్టడమెందుకూ? నీ మంచికే చెప్తున్నాను. నీ భార్యను మరీ ఎక్కువగా ప్రేమించకు రవీ" అంది.

సంస్కారం లేనివాళ్ళు 'ప్రేమ' అని దేన్ని అంటారో అర్థమయింది. జాలి వేసింది. ఐనా ఉషకి ధైర్యం చెప్పాలనిపించింది.

"పిల్లలు లేరని దిగులుట మీ అందరికీ. పెళ్ళి అయి ఎన్నాళ్ళయిందనీ! యింకా రెండేళ్ళు కాలేదు . " అంటున్నాను. ఉష లేచికూర్చుంది

"నిజం తెలేటానికి ఎన్నాళ్ళో అవసరంలేదు. ఇంక నాకు పిల్లలు పుట్టరు రవీ. క్రోటన్సు మొక్కలు ఏపుగా పెరుగుతాయితప్ప పూలు పుయ్యవు. కాయలు కాయవు. మా ప్రేమకి అవన్నీ అడ్డు రాకూడదు రవీ. ఇంక ఆయన వస్తారు. నేను ఇట్లాగ పడుకుంటే "నా మీద ప్రేమలేదా?" అంటారు.

ఇంక వెళ్ళిరా రవీ పూలు నలిగిపోయాయి. మళ్ళీ దండ గుచ్చుకోవాలి. వేశ్యలు ఉండకూడదని ఎవరన్నారో మూర్ఖులు! పిల్లలతో ఇల్లాళ్ళు హాయిగా బతకాలంటే వేశ్యలుండాలి. తెలిసిందా? వెళ్ళిరా. నాకు మందు లేదు రవీ . ఏ మందూ అవసరం లేదు . ." అంది.

ఇంటికి వెళ్ళటానికి లేచాను.

ఉష సిగ్గుపోయుంగా ఆ మాటలు అందని తెలుసు నాకు.

వివాహ వ్యవస్థ గురించి ఆలోచించటం మొదలుపెట్టాను. □□